

# నేటినిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | ఆదివారం 28-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 179 | పేజీలు:4 | వెల: రూ.1/-

# ఎవడుపడితే వాడు గన్‌పార్క్‌కు రమ్మనడమేనా ?

## రెండేళ్లుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారు

### మండిపడ్డ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఎవడు పడితే వాడు గన్‌పార్క్ దగ్గరకు చర్చకు రమ్మంటే మంత్రి కేటీఆర్ వస్తారా? అని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ప్రశ్నించారు. చర్చకు రమ్మని అడగడానికి స్థాయి అంటూ ఉండాలన్నారు. రెండేళ్లుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారని తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. కేంద్రం ఇస్తామన్న కోటి ఉద్యోగాల సంగతి ముందుగా చెప్పి బిజెపి నేతలు మాట్లాడాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై టీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గ్రేటర్ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయని, అందువల్ల ఓవర్ కాన్ఫిడెన్స్ వద్దని సూచించారు. దుబ్బాక సిటింగ్ సీటును బీజేపీకి కోల్పోయిన టీఆర్ఎస్.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ సిటింగ్ సీటు హైదరాబాద్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇక్కడి మూడు జిల్లాల్లోనూ ఉమ్మడి జిల్లాలవారీగా ముగ్గురు మంత్రులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి హరీశ్‌రావు, హైదరాబాద్‌కు మంత్రి గంగుల కమలాకర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వేముల ప్రశాంత్ రెడ్డిలను ఇన్‌చార్జులుగా సీఎం కేసీఆర్ నియమించారు. ఆయా జిల్లాల మంత్రులతో కలిసి వీరు పని చేస్తారు. బూత్ స్థాయి వరకూ అందర్నీ సమాయత్తం చేసే బాధ్యతను వీరికి అప్పగించారు. ఇదిలావుంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉందని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు ఇవాళ మాట్లాడడానికి ఏమీ లేదన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తీసుకొచ్చిన సంస్కరణల వల్ల నేడు భారత దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళుతోంద న్నారు. పీవీ కూతురైన వాణి దేవిని గెలిపించాలని కోరారు. తొలిసారిగా ఒక మహిళా ఎమ్మెల్సీని గెలిపించే అవకాశం మనకు లభించిందన్నారు. మనం వాణి దేవిని గెలిపించడం ద్వారా పీవీ నరసింహారావును మరింత గౌరవించుకునే వాళ్లమవుతామని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# ఇక అందరికీ కరోనా టీకా

## మార్చి 1నుంచి వేసేందుకు కార్యాచరణ

హైదరాబాద్,ఫిబ్రవరి28(ఆర్ఎన్ఎ): ఇక అందరికీ కరోనా టీకా అందనుంది. మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న రెండోవిడత వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సామాన్య ప్రజలకు టీకా వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటిదాకా ఆరోగ్య కార్యకర్తలు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు వ్యాక్సిన్లు అందగా.. ఇక నుంచి 60 ఏళ్లకు పైబడినవారు, 45 ఏళ్లకు పైబడి.. దీర్ఘకాలిక వ్యాధుల (బీపీ, షుగర్) బాధపడే వారికి ప్రాధాన్య ప్రాతిపదికన వ్యాక్సినేషన్ చేయనున్నారు. ఇప్పటిదాకా ఆరోగ్య కార్యకర్తలు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు వ్యాక్సిన్ అందించారు. ఈ ప్రక్రియ జిల్లాల్లో ఇంకా కొనసాగుతోంది. మొదటగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి వ్యాక్సినేషన్ చేపట్టగా ఫ్రంట్‌లైన్ వారియర్స్ కింద పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బందికి వ్యాక్సినేషన్ చేశారు. మొదటి దఫాలో టీకా తీసుకున్న వీరికి రెండో దఫా టీకా కూడా వేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందికి వ్యాక్సినేషన్ చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు టీకా వేయడం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు వేలాదిమందికి వ్యాక్సినేషన్ చేశారు. అనివార్య కారణాల వల్ల టీకా వేయించుకోని వారికి వ్యాక్సినేషన్ చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా ప్రభుత్వం 60 ఏళ్లు పైబడిన వృద్ధులతో పాటు 45 సంవత్సరాలు పైబడి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి టీకా వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో వీటికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడనున్నాయి. అయితే 60 ఏళ్లు పైబడిన, 45 ఏళ్లు పైబడి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రిజిస్ట్రేషన్ పద్ధతి ద్వారా టీకా వేసేందుకు ఏర్పాట్లు చేయనున్నామని అధికార వర్గాలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత 'కొవిన్' సాఫ్ట్‌వేర్‌లో వారి వివరాలను అప్‌లోడ్ చేసి టీకా వేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో బీపీ, షుగర్, హైపర్‌టెన్షన్, టీబీ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి టీకావేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

# బొమ్మల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తాం

## టాయ్ ఇండియా ఫెయిర్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): భారతీయుల సైకాలజీ, జీవావరణానికి తగ్గినట్లు బొమ్మలను తయారు చేయాలని ప్రధాని మోదీ బొమ్మల ఉత్పత్తిదారులను కోరారు. సాధ్యమైనంత వరకు బొమ్మల తయారీలో ప్లాస్టిక్‌ను తగ్గించాలని, రీసైక్లింగ్‌కు అనువైన పదార్థాలను వాడాలని ఆయన సూచించారు. బొమ్మల పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇండియా టాయ్ ఫెయిర్ 2021ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్చువల్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్‌లో బొమ్మలన్నీ దాదాపు సహజసిద్ధంగా, పర్యావరణహితమైన పదార్థాలతో తయారు అవుతాయని ప్రధాని అన్నారు. భారతీయ బొమ్మలకు వాడే రంగులన్నీ సహజమైనవని, సురక్షితమైనవని తెలిపారు. విశ్వవ్యాప్తంగా భారతీయ బొమ్మలకు డిమాండ్ ఉందని, మేడిన్ ఇండియాకు గుర్తింపు ఉన్నట్లు.. హ్యాండ్ మేడ్ ఇన్ ఇండియా బొమ్మలకు కూడా మార్కెట్ ఉందని మోదీ అన్నారు. జాతీయ బొమ్మల కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని,15 మంత్రిత్వశాఖలతో ఆ కార్యాచరణ ప్రణాళికను అనుసంధానం చేశామని ప్రధాని తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సురభి వాణిని గెలిపించాలి



## సోషల్ మీడియాతో ప్రజలకు సమాచారం చేరవేయాలి

### టిఆర్ఎస్‌కున్న నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవాలి

### గ్రాడ్యుయేట్లను నేరుగా కలసి ఓటు అడగాలి

### కాంగ్రెస్,బిజెపిలకు ఓటేస్తే లాభం లేదని చెప్పాలి

### ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు

రంగారెడ్డి,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు ఓటేస్తే ఏం లాభమని, వారేమైనా అధికారంలో ఉన్నారా అని మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ తెచ్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ పేరు నిషేధమని, ఎన్నికల కోసమే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పేరును ఉచ్చరించేదని విమర్శించారు. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నంలో జరిగిన టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సురభి వాణీదేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఇబ్రహీంపట్నం నుంచే ప్రారంభమైందని చెప్పారు. 70 నుంచి 80 శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని, ఓటింగ్ శాతం పెరిగితే టీఆర్ఎస్‌దే విజయమన్నారు. బీజేపీకి, కాంగ్రెస్ పార్టీలకు లేని నెట్‌వర్క్ తమకు ఉందని, కష్టపడి పని చేస్తే గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వాణీదేవి పేరు మార్మోగాలన్నారు. ప్రతి ఒక్కరికి టిఆర్ఎస్ సందేశం వెళ్లాలని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీలు 70 ఏండ్లు అధికారంలో ఉన్నాయని, కనీసం తాగడానికి నీరు ఇచ్చాయా అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు నీటి తీరువా, శిస్తులు వసూలు చేస్తే.. టీఆర్ఎస్ సర్కార్ వచ్చాక వాటిని రద్దు చేయడమేకాకుండా, ఎకరానికి రూ.10 వేలు రైతుబంధు కింద ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని 16 వేల మెగావాట్లుకు పెంచామని చెప్పారు. తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడైనా రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తున్నారేమో చూపించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను మిషన్ భగీరథ, రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని విమర్శించారు. దేశంలో ఇన్నేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ.. ఏ రాష్ట్రంలో అయినా ఇంటింటికీ తాగు నీరు ఇచ్చిందా? అని ప్రశ్నించారు. మన రైతు బంధును కాపీ కొట్టి రూ.6 వేలు ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో పేదింటి యువతి పెండ్లికి రూ.లక్ష ఇస్తున్నామని, దీనినే గరీబ్ కళ్యాణ్ యోజన పేరుతో బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్నదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఇవ్వాల్సినవి ఇవ్వడానికి చేతకాదని విమర్శించారు. విభజన చట్టంలో రేల్వే కోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతానికి రూ.400 కోట్లు, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ ఇస్తామని హామీ చేశారని, దమ్ముంటే బీజేపీ నేతలు వీటిని తీసుకొచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి దేశ వృద్ధిరేటు 8 శాతంగా ఉందని, ప్రస్తుతం అది మైనస్ 8 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అదే తెలంగాణ 14 శాతం వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. తెలంగాణ కోసం రాజీనామా చేయాలంటే కిషన్ రెడ్డి తప్పించుకున్నారని విమర్శించారు. ఇబ్రహీంపట్నంకు కృష్ణా నీటిని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వారు ప్రశ్నించే గొంతులమని అంటున్నారు. మేం సమస్యలను పరిష్కరించేవారిమని వెల్లడించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సురభి వాణీదేవిని పీవీ కుమార్తెగా కాకుండా విద్యావేత్తగా, సేవాభావం కలిగిన వ్యక్తిగా చూడాలని, ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగితే తమదే విజయమన్నారు మంత్రి హరీశ్ రావు. బీజేపీకి, కాంగ్రెస్ పార్టీలకు లేని నెట్ వర్క్ తమకుందన్నారు. ఓటరును నేరుగా కలిసి టీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలో వివరించాలన్నారు. సురభి వాణీదేవి పీవీ కుమార్తె కాకుండా విద్యావేత్తని.. సేవా భావం కలిగిన వ్యక్తన్నారు. ఏకైక మహిళా అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రగతికి దండిగా నిధులు

## ప్రాథమిక అవసరాలకు ఖర్చు

### పారిశుద్య నివారణ లక్ష్యంగా కృషి

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలన్న సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతికి ప్రభుత్వం నిధులు భారీగా విడుదల చేస్తున్నది. పట్టణ ప్రగతిలో పట్టణాల బస్తీలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. భారీగా వచ్చిన నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మున్సిపాలిటీలకు సర్కారు నిధులను విడుదల చేసింది. పట్టణ ప్రగతిలో భాగంగా బస్తీల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నారు. నిధుల కొరత లేకపోవడంతో వెంటనే అభివృద్ధి పనులను చేపట్టారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే దిశలో అధికారులు ముందుకుసాగుతున్నారు. మోడల్ మార్కెట్లు, పార్కుల అభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుధ్య వ్యవస్థ కోసం వాహనాల కొనుగోలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగల తొలగింపు పనులను చేపట్టనున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పట్టణాల్లోని ప్రజల సమస్యలను గుర్తిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అక్కడితో ఆగకుండా వాటిని కార్యాచరణలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. భారీగా నిధులు విడుదల చేసిన నేపథ్యంలో చిన్నచిన్న సమస్యలతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. పట్టణ ప్రగతికి నిధుల కొరత లేదు. ప్రణాళికలు చేసి కార్యాచరణ చేయాలన్ని సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లుగానే పట్టణ ప్రగతి ప్రారంభించిన రెండు రోజుల్లోనే నిధులను విడుదల చేసి బస్తీల్లో అభివృద్ధికి బాటలు వేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు కలిపి ప్రతి నెలా రూ.148 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జనాభా ధమాషా ప్రకారం కేటాయించనున్నారు. పూర్తి గ్రాంట్‌గా ప్రభుత్వం పట్టణ ప్రగతికి నిధులు కేటాయించింది. పట్టణ ప్రగతిలో ప్రతినెలా కార్పొరేషన్‌లతో పాటు మున్సిపాలిటీలకు నిధులు రానున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా నెలనెలా గ్రామ పంచాయతీలకు రూ.339 కోట్లు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిధులతో గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. అదే స్ఫూర్తితో పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు ప్రతినెల కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలకు విడుదల చేయనుంది. ఆయా మున్సిపాలిటీలకు జనాభా ధమాషా పద్ధతిలో కేటాయించారు. పట్టణ ప్రగతిలో చేసిన అభివృద్ధి ప్రణాళికలకు నిధులను వినియోగించనున్నారు.

# జిడిపి తగ్గుతోంది...ధరలు పెరుగుతున్నాయి

## –ఇదీ బిజెపి సాధించిన ఘనత అన్న కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి అనే మాట అటుంచితే తన చర్యలతో సామాన్యుల నడ్డి విరగ్గొడుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారని కెటిఆర్ నిర్మొహమాటంగా చెప్పారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ నెటిజన్లకు ఓ ప్రశ్నను సంధించారు. జీడీపీ ఫుల్‌ఫాం ఏంటీ ..ఇది కేంద్ర ప్రభుత్వం అసాధారణ పనితీరు కారణంగా నిరంతరం పెరుగుతూ పోతుందన్నారు. జీడీపీ(గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్షన్) అనగా స్థూల జాతీయోత్పత్తి. ఒక దేశంలోని ఆర్థిక కార్యకలాపాల విలువను జీడీపీతో కొలుస్తారు. జీడీపీ వృద్ధి చెందుతుందంటే దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని అర్థం. గత ప్రభుత్వాల హయాంలో రూ. 400 ఉండే గ్యాస్ రూ. 800, రూ. 60 రూపాయలు ఉన్న పెట్రోలు రూ.100, డీజిల్ ప్రస్తుతం రూ.89, గతంలో రూ. 80 ఉన్న మంచినూనె రూ. 150 అయింది.గ్యాస్, పెట్రోల్, డీజిల్ పెరుగుదల ప్రతీ నిత్యావసర వస్తువుపై పడుతుండటంతో పేద, మధ్య తరగతి బ్రతుకులు భారమౌతున్నాయి. అచ్చేదిన్ అని జనం చచ్చే దిన్ తెచ్చారని అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ హయాంలో జీడీపీ పెంచుతామంటే దేశాన్ని అభివృది పథంలోకి తీసుకువెళతా రనుకున్నాం కానీ ఇలా గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూపోతారని అనుకోలేదని అంటున్నారు.

## కొవిడ్–19పై అప్రమత్తత : రాష్ట్రాలకు కేంద్రం లేఖ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: కొవిడ్–19 కేసులు మళ్లీ పెరుగుతుండటం, మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో కరోనా కట్టడికి అప్రమత్తతో వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. కొవిడ్–19ను పూర్తిగా అధిగమించే వరకూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతూ హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ భల్లా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. గత కొద్దినెలలుగా కొవిడ్ క్రియాశీలక కేసులు గణనీయంగా తగ్గుతున్నా మరింత అప్రమత్తత, నిఘాతో మహమ్మారిని దీటుగా ఎదుర్కోవాల్సి ఉందని ఈ లేఖలో ఆయన పేర్కొన్నారు.మరోవైపు కొవిడ్–19 కట్టడికి కేంద్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం మార్చి 31 వరకూ పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా హోంశాఖ రాష్ట్రాలను కోరింది. కరోనా కట్టడికి విధించిన నిబంధనలు, నిర్దిష్ట నిర్వహణా ప్రమాణాలను (ఎస్ఓపీ) కచ్చితంగా పాటించేలా చూడాలని రాష్ట్రాలకు రాసిన లేఖలో హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం



(ఫిబ్రవరి 28 : గాయకుడు, సంగీత దర్శకుడు రవీంద్రజైన్ పుట్టినరోజు..)

–రాధశ్రీ
సెల్: 9494481210



# కెసిఆర్‌కు కర్రుకాల్చి వాత పెట్టే రోజు వచ్చింది

## ఎమ్మెల్సీ ప్రచారంలో మోత్కుపల్లి ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ మనిషనుకుని ఓట్లు వేయడమే తమ మొదటి తప్పని బీజేపీ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కెసిఆర్‌కు కర్రు కాల్చి వాతలు పెట్టే రోజు వచ్చిందన్నారు. ఎమ్మెల్సీగా ప్రేమేందర్ రెడ్డి గెలిస్తే బీజేపీ కార్యకర్తలు గెలిచినట్టేనన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బాధలు చెప్పుకోవడానికి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లను కుక్కలతో పోల్చిన కేసీఆర్ తమకు లేదనుకుని కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. తెలంగాణా రాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న సీఎం తన కుటుంబానికి నాలుగు ఉద్యోగాలు ఇచ్చుకున్నారన్నారు. ఈ రాష్ట్రంలో మోసం చేసే వాళ్లే ఎమ్మెల్యేలుగా చెలామణి అవుతున్నారన్నారు. బ్యాలెట్ పేపర్లో 71 మందిలో మొదటి పేరు తనది కావడం అదృష్టమన్నారు ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి. తనను గెలిపించి నిరుద్యోగుల పక్షాన పోరాడే అవకాశం ఇవ్వాలన్నారు.

# భక్తి ఉద్యమానికి సంత్ రవిదాస్ విశేష కృషి

## –నివాళి అర్పించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): భక్తి ఉద్యమ వ్యాప్తికి 15, 16 శతాబ్దాల్లో విశేషంగా కృషి చేసిన సంత్ రవిదాస్ 644వ జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారంనాడు ఘనంగా నివాళులర్పించారు. సమానత్వం, సౌహార్దం÷–ర, దయ వంటి ఉత్తమ గుణాలను తమ సందేశాలుగా శతాబ్దాల క్రితమే చాటిచెప్పిన ఘనత సంత్ రవిదాస్‌కు దక్కుతుందని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేసుకున్నారు. శతాబ్దాలుగా దేశ ప్రజలకు ఆయన సందేశాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని మోదీ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. భక్తి ఉద్యమానికి చెందిన సంత్ రవిదాస్ 15, 16 శతాబ్దాల్లో పాడిన పలు కీర్తనలు గురుగ్రంథ్ సాహిబ్‌లోనూ చోటుచేసుకున్నాయి. 21వ శతాబ్దపు రవిదాసియా మతానికి ఆయనను వ్యవస్థాపకుడిగా కూడా కొందరు భావిస్తారు. రవిదాస్ జయంతిని మాఘ పౌర్ణమి పర్వదినం నాడు జరుపుకొంటారు.

# లైసెన్సుడు ఆయుధాలు అప్పగించాలి

## పట్టభద్ర ఎన్నికల సందర్భంగా సిపి ఆదేశాలు

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): జంటనగరాల్లో ఆయుధ లెసెన్స్‌కలిగిన వారంతా తమ ఆయుధాలను వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో కానీ, అధికారిక ఆయుధ డీలర్లకు అప్పగించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 14వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. లైసెన్స్ కలిగిన ఆయుధరాలను ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మార్చి 24న తిరిగి వారు తీసుకోవచ్చని తెలిపారు.

# ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో తొలి అంతరిక్ష ప్రయోగం

## నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ సీ 51వాహక నౌక

### పలు శాటిలైట్లను పంపేందుకు ఏర్పాట్లు మొదలైన కౌంట్‌డౌన్

నెల్లూరు,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): సరికొత్త అధ్యాయానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో కౌంట్‌డౌన్ ప్రారంభించింది. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో తొలి అంతరిక్ష ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం చేపట్టనున్న పీఎస్ఎల్వీ –సీ51 ప్రయోగంతో వాణిజ్య రంగంలో తొలి అడుగు వేయనుంది. ఇందులో భాగంగా శనివారం ఉదయం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో రాకెట్ కౌంట్‌డౌన్‌ను శాస్త్రవేత్తలు ఉదయం 8.54 గంటలకు ప్రారంభించారు. సుమారు 25.30 గంటల పాటు ప్రక్రియ కొనసాగనుంది. ఆదివారం ఉదయం 10.24గంటలకు పీఎస్ఎల్ వీ–సీ51 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. అమెజానియా–1తో పాటు మరో 18 ప్రైవేటు ఉపగ్రహాలను రాకెట్ మోసుకెళ్లనుం ది. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ నేతృత్వంలో నింగిలోకి తొలి వాణిజ్య ఉపగ్రహాలను పీఎస్ఎల్ కక్షలో ప్రవేశపెట్టనుంది. బ్రెజీలియన్ శాటిలైట్ అమెజానియా–1 భూపర్యవేక్షణకు కీలకమైంది. అమెరికాకు చెందిన స్పేస్ బీస్ పేరుతో 12 ఉపగ్రహాలు, సాయ్?1 నానో కాంటాక్ట్–2 అనే ఒక ఉపగ్రహంతో పాటు యూనిటీశాట్ పేరుతో మూడు యూనివర్సిటీల విద్యార్థులు తయారుచేసిన మూడు ఉపగ్రహాలు, సతీశ్ ధావన్ శాట్, సింధునేత్ర అనే ఉపగ్రహాలను రోదసీలోకి పంపనుంది.అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్) వేదికగా 2021లో తొలి హిట్ కొట్టేందుకు ఇస్రో సిద్ధమైంది. తన నమ్మకమైన వాహకనౌక పీఎస్ఎల్వీ సీ 51ను నింగిలోకి పంపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రయోగానికి సంబంధించి శాస్త్రవేత్తలు అన్ని పరీక్షలు పూర్తి చేశారు. మొదటి ప్రయోగవేదిక నుంచి రోదసిలోకి రాకెట్ దూసుకుపోవడమే మిగిలింది. ఇలాకరోనా లాక్‌డౌన్‌తో 2020 నింపిన చేదు అనుభవాలను అధిగమించి 2021లో సరికొత్త అడుగులేసేందుకు ఇస్రో ప్రణాళికలు రూపొందించింది. ఒక వైపు చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్ 1, గగన్‌యాన్‌కు సిద్ధమవుతూనే.. వాణిజ్యపరమైన ప్రయోగాలు చేసేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా షార్ నుంచి ఆదివారం ఉదయం 10.24కు పీఎస్ఎల్వీ సీ- 51 ఉపగ్రహ వాహకనౌకకు నింగిలోకి పంపనుంది. ప్రయోగానికి 25 గంటల ముందుగా శనివారం ఉదయం 8.54కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ ప్రయోగం ద్వారా బ్రెజిల్ దేశానికి చెందిన 637 కిలోల బరువు కలిగిన అమెజానియా 01 అనే ఉపగ్రహంతో పాటు మరో 18 చిన్న తరహా ఉపగ్రహాలను రోదసిలో ప్రవేశపెట్టనున్నారు. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ప్రారంభించాక పూర్తి స్థాయి వాణిజ్యపరమైన మొదటి ప్రయోగం కావడం దీని ప్రత్యేకత.



# పీకలదాకా తాగి కారు డ్రైవింగ్

## ట్రాఫిక్ సిగ్నల్ ఢీకొని ప్రమాదం: ఒకరు మృతి

### టిప్పర్ ఢీకొనడంతో లారీకింద చిక్కుకున్న వ్యక్తి

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): వనస్థలిపురం పోలిస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. యువకుడు మద్యం మత్తులో కారు డ్రైవ్ చేయడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హస్తినాపురం వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. గౌతమ్ అనే యువకుడు తన స్నేహితులు ఇద్దరితో కలిసి సాగర్ రోడ్ నుంచి ఇబ్రహీం పట్నం వెళ్తున్నాడు. అప్పటికే అతడు మద్యం సేవించి ఉన్నాడు. ఈ క్రమంలో హస్తినాపురంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు డివైడర్ పై నుంచి మరో పక్కకి దూసుకెళ్లింది. గౌతమ్‌తో పాటు కారులో వెనకాల సీట్‌లో కూర్చున్న అతడి స్నేహితుడు సందీప్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే మరో స్నేహితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. ఇక యాక్సిడెంట్ చేసిన గౌతమ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే నగరంలోని ఎల్బీనగర్ పరిధిలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. సాగర్ రింగ్ రోడ్డు నుండి టీకేఆర్ కమాన్ వైపు వెళ్తున్న టూవీలర్‌ను టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తన వాహనంతో సహా లారీ కింద ఇరుక్కుపోయాడు. దాదాపు 15 నిమిషాల పాటు ఆ వ్యక్తి నరకయాతన అనుభవించాడు. లారీ కింద ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటకు తీసేందుకు జేసీబీ ఆలస్యంగా రావడంతో స్థానికుల సాయంతో ఎల్బీనగర్ పోలీసులు తీవ్రంగా గాయపడిన వ్యక్తిని బయటకు తీశారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

